## క్లుప్తంగా

### దోమల నివారణకు చర్యలు

తంబళ్లపల్లె: కోసువారిపల్లె పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ అనుపమ ఆదేశాల మేరకు మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బుధవారం హాస్టల్స్‌లో దోమల నివారణకు చర్యలు చేపట్టారు. బీసీ హాస్టల్, మోడల్ స్కూల్, కేజీబీవీ, గిరిజన రెసిడెన్షియల్ స్కూల్స్‌లో మెలాథిన్ స్ప్రే చేశారు. విద్యార్థులకు ఆరోగ్య సలహాలు ఇచ్చారు.

### విద్యాసామగ్రి అందజేత

బి.కొత్తకోట : మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల యాలగిరిపల్లెలో మాకిరెడ్డి నారాయణరెడ్డి జ్ఞాపకార్థం కుమారుడు త్రిలోక్ బుధవారం విద్యార్థులకు విద్యాసామగ్రి అందించారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 40 మంది విద్యార్థులకు పలకలు, నోట్‌పుస్తకాలు, పెన్స్, పెన్సిల్, లెక్కల పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రెడ్డిశేఖర్, ప్రధానోపాధ్యాయులు స్వర్ణలత, ఉపాధ్యాయులు నవప్రసాద్‌రెడ్డి, గిరీష్ పాల్గొన్నారు.

### సారా విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

మదనపల్లె : పట్టణంలోని నక్కలదిన్నెలో డీటీఎఫ్ సిబ్బంది జరిపిన దాడుల్లో సారా విక్రయిస్తున్న మహిళను అరెస్ట్‌చేసి సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ సీఐ రమేష్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... నక్కలదిన్నె తండాలో సారా అమ్ముతున్నారన్న సమాచారం మేరకు డీటీఎఫ్ ఎస్ఐ హేమకుమార్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారన్నారు. గోపీనాయక్ భార్య పద్మావతి(42) సారా విక్రయిస్తూ పట్టుబడటంతో ఆమెను అరెస్ట్‌చేసి, 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితురాలిని రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరుపరిచనట్లు తెలిపారు.

### వేలం ద్వారా రూ. 8.35 లక్షల ఆదాయం

పీలేరు : వేలం పాట ద్వారా పీలేరు గ్రామ పంచాయతీకి రూ. 8.35 లక్షలు ఆదాయం వచ్చినట్లు సర్పంచ్ జీనత్ షఫీ, ఈఓ గఫూర్ తెలిపారు. బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో దినసరి మార్కెట్, పాతబస్టాండ్, జంతువధశాలకు సంబంధించి గేటు వసూలుకు తొమ్మిది నెలల కాలానికి వేలం నిర్వహించారు. హెచ్చు పాట ద్వారా దినసరి మార్కెట్ నవాబ్ రూ. 1.99 లక్షలు, పాతబస్టాండ్ బషీర్ అహ్మద్ రూ. 3.67లక్షలు, జంతువధ శాలలు నజీర్ రూ. 2.64 లక్షలతో దక్కించుకున్నారు.

### రోడ్డుప్రమాద ఘటనపై కేసు నమోదు

మదనపల్లె : రోడ్డుప్రమాద ఘటనపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ ఎన్.శేఖర్ తెలిపారు. పుంగనూరు మండలం పూజగానిపల్లెకు చెందిన రాఘవేంద్రరెడ్డి(40) వ్యక్తిగత పనులపై ఆటోలో మదనపల్లెకు వస్తుండగా, కృష్ణాపురం వద్ద ఐషర్ వాహనం ఢీకొంది. ప్రమాదంలో రాఘవేంద్రరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుని తల్లి రాణెమ్మ ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

### అంబేడ్కర్ భవనానికి స్థలం కేటాయించాలి

పీలేరు రూరల్ : పీలేరులో అంబేడ్కర్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని మాలమహానాడు నాయకులు టి. ధరణికుమార్ అన్నారు. బుధవారం మాలమహానాడు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీలేరులో వందల ఎకరాల భూములు ఆక్రమణలకు గురవుతున్నాయన్నారు. అయితే అంబేడ్కర్ భవనానికి స్థలం కేటాయించాలని గతంలో ఎస్సీ కమిషన్ కార్యాలయం నుంచి రెవెన్యూ శాఖ అధికారులకు ఉత్తర్వులు ఇచ్చినా కూడా స్థలం చూపకుండా జాప్యం చేశారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అంబేడ్కర్ భవనానికి స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు పాల్గొన్నారు.

### ఘనంగా హిందూసామ్రాజ్య దినోత్సవం

రామసముద్రం: మండల కేంద్రంలో రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో హిందూసామ్రాజ్య దినోత్సవం వైభవంగా నిర్వహించారు. మండలంలోని బజరంగ దళ్ యువసేన, ఛత్రపతి శివాజీ అభిమానులు , నాయకులు ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి కాసాయి జెండాలు పట్టి దిగువపేట నుంచి బజారువీధి, ఎగువ చెక్ పోస్ట్ వరకు జై భరతమాత జై ఛత్రపతి శివాజీ మహారాజ్ నినాదాలతో హోరెత్తించారు. శివాజీ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని యువత ముందుకు పోవాలని పిలుపునిచ్చారు. ఎస్ఐ చంద్రశేఖర్ పోలీస్ బందోబస్తు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో చెన్నకేశవులు, మల్లికార్జునస్వామి, నాగరాజు, నాగభూషణంశెట్టి , సాయిశివాజీ, అమర మహేష్, బిజెపి శ్రీనివాస్ , చలపతి, వినోద్, వాల్మీకి కిట్టు, బాలాజీ, నాగరాజ, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

### మహమ్మారమ్మ జాతర

మదనపల్లె సిటీ: స్థానిక ఎస్‌బీఐ కాలనీలో మహమ్మారమ్మ జాతర బుధవారం ఘనంగా జరిగింది. జాతర పురస్కరించుకుని ఆలయాన్ని రంగు రంగు విద్యుత్‌దీపాలతో అలకరించారు. మహిళలు దీలు,బోనాలు సమర్పించారు. నిర్వాహకులు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు.

# రాజంపేట టీడీపీకి ఓటమి సెగలు!

- నుగవాసిపై చంద్రబాబు అసహనం
- ఇన్‌చార్జి ఎవరో తేల్చని అధిష్టానం
- సంశయంలో అధికారగణం
- సీఎంకు నివేదికల పరంపర
- ఓటమిపై నేతల ఆరోపణలు



చంద్రబాబుకు నివేదిక అందజేస్తున్న సుగవాసి బాలసుబ్రమణ్యం

రాజంపేట: రాజంపేటలో తెలుగుదేశం పార్టీకి ఓటమి సెగలు వెంటాడుతున్నాయి. ఓటమిపై ఒకరిపై ఒకరు ఆరోపణలు చేస్తున్నారు. ఇదే విషయంపై సీఎం చంద్రబాబుకు నివేదికలు, ఫిర్యాదులు చేస్తున్నట్లు సమాచారం. పాత, కొత్త నేతలు ఓటమిపై విమర్శలు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ముఖ్యమంత్రిని టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం కలిసి ఓటమికి గల కారణాలపై నివేదికను అందజేసిన సంగతి తెలిసిందే.

**చంద్రబాబు అసహనం**

సీఎంను కలిసిన సుగవాసికి అక్కడ ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డాయి. నివేదికను సమర్పించిన తరుణంలో సీఎం చంద్రబాబు ప్రతికూలంగా స్పందించారు. ఓ సందర్భంలో ముఖ్యమంత్రి అసహనం వ్యక్తం చేశారని చెబుతున్నారు. గెలిచే సీటును చేజార్చుకోవడమేమిటని నిలదీశారు. తాను, జనసేన అధినేత పవన్, నారాలోకేష్ రాజంపేటకు వచ్చి ఎన్నికల్లో ప్రచారం చేసి హామీలను నెరవేరుస్తామని చెప్పామని, జనం నుంచి అనుహ్య స్పందన వచ్చిందని, అయినా టీడీపీ అభ్యర్థి ఓటమి చెందడం ఏమిటని ప్రశ్నించారు.

**వివాదాస్పదంగా నేతల తీరు**

రాజంపేటలో టీడీపీ ఓటమి చెందినప్పటికి, అధికారం రావడంతో పాత, కొత్త నేతల వ్యవహారం వివాదాస్పదంగా మారుతోంది. ఇప్పటికే పాత, కొత్తనేతల పనితీరును సీఎం దృష్టికి తీసుకెళ్లారు. పరిస్థితి ఏ మాత్రం సంతృప్తికరంగా లేదని సీఎం పేర్కొన్నట్లు పార్టీవర్గాలు చెప్పుకుంటున్నాయి.

**రైల్వేకోడూరుకే బత్యాల పరిమితం**

రాజంపేట తెలుగుదేశం పార్టీకి ఇన్‌చార్జి ఎవరన్నది తేలాల్సి ఉంది. అయితే తానే ఇన్‌చార్జి అని సుగవాసి ముందుకొస్తున్నారు. కాని పార్టీలో కొందరు నేతలు సుగవాసి ఇన్‌చార్జిగా ఉండటాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. 2019 ఎన్నికల్లో ఓటమిపాలైన మాజీ ఎమ్మెల్యే బత్యాల చెంగల్రాయుడు, ఇన్‌చార్జిగా కొనసాగుతూ పార్టీ క్యాడర్‌కు అండగా ఉన్నారు. సుగవాసిలో బరిలోకి దిగడంతో ఆయన రైల్వేకోడూరుకే పరిమితమైయ్యారనే విమర్శలున్నాయి. ఆయన కూడా పైకి సుగవాసి ఇన్‌చార్జి అని, ఆయన వద్ద క్యాడర్ వెళ్లి పనిచేసుకోవాలని హితువు పలికిన సంగతి తెలిసిందే.

## ఇంధన పొదుపు ఆదాయానికి మలుపు



నగదు బహుమతులు అందజేస్తున్న డీఎం కుమార్

పీలేరు రూరల్ : ఇంధన పొదుపు ఆర్టీసీ ఆదాయానికి మలుపు అని డీఎం కుమార్ అన్నారు. బుధవారం స్థానిక గ్యారేజ్‌లో ఆదర్శ ఉద్యోగులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లు కె.వి. స్వామి, ఇ. గోవిందుల తోపాటు అధిక ఈపీకే సాధించిన కండెక్టర్లకు నగదు బహుమతి అందజేశారు. వీరిని ఆర్టీసీ డ్రైవర్లు, కండెక్టర్లు ఆదర్శంగా తీసుకుని ఆదాయం పెంచడానికి కృషి చేయాలన్నారు.

**నిషేధిత వస్తువులు విక్రయిస్తే చర్యలు తప్పవు**

ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలోని దుకాణాల్లో నిషేధిత వస్తువులు విక్రయిస్తే చర్యలు తప్పవని డీఎం కుమార్ హెచ్చరించారు. బుధవారం వివిధ దుకాణాలను తనిఖీ చేశారు. నిషేధిత వస్తువులు (బీడీలు, సిగరేట్లు) గుర్తించి ధ్వంసం చేశారు. ఇకపై ఇలాంటి వస్తువులు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ సుబ్బమ్మ, గ్యారేజ్ ఎంఎఫ్ హరినాథరెడ్డి, ఎస్టీఐ బాబునాయక్ పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్లో స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ

పెద్దతిప్పసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు స్టూడెంట్స్ కిట్స్ మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో బుధవారం ఎంఈఓ నారాయణ, ఎంఈఓ-టూ గోస్‌పీర్‌లు స్థానిక మోడల్ స్కూల్ విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్స్ అందజేసినట్లు ప్రిన్సిపాల్ శివకుమారి పేర్కొన్నారు.

# తేరుకుంటున్న పులుసుగుంతల

- కలవరపెట్టింది ఈకోలి బాక్టీరియా
- తాగునీటి కలుషితం వల్లే విరేచనాలు, వాంతులు
- మెడికల్ కళాశాల పరీక్షల్లో వెల్లడి



పులుసుగుంతలలో తాగునీటి ట్యాంకును పరిశీలిస్తున్న వైద్యాధికారులు

కురబలకోట: మండలంలోని పులుసుగుంతలలో విరేచనాలు, వాంతులతో విరుచుపడ్డ మహమ్మారికి తాగునీరు కలుషితం కావడమే కారణమని తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల పరీక్షలలో వెల్లడైంది. మదనపల్లె ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల రిపోర్టులో కూడా ఇదే విషయం వెల్లడైంది. గ్రామంలోని ప్రభుత్వ తాగునీటి బోరు, మరో వ్యవసాయ బోరు నీటిలో ఈ కోలి (ఎస్చెరిషియా కోలి)బాక్టీరియా ప్రబలినట్లు గుర్తించారు. ఈ నీటిని తాగడం వల్ల గ్రామంలో ఈ పరిస్థితి తలెత్తినట్లు తాగునీటి శాంపిల్స్ పరీక్షలలో తెలిసి వచ్చిందని మండల వైద్యాధికారి కె.శ్రీధర్ తెలిపారు. వారం క్రితం ఆ ఊరు విరేచనాలు, వాంతులతో ఒక్కసారిగా విలవిలలాడిన విషయం తెలిసిందే. ఊరంతా కలవరపడింది. కలకలాన్ని సృష్టించింది. ఆ ఊరిలో శివమ్మ అనే వృద్ధురాలు మృతి చెందడంతో పాటు 35 మంది వీటి బారిన పడ్డారు. తిరుపతి రుయా, మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో తీవ్ర అస్వస్థతతో ఐదుగురు చేరారు. వీరు కూడా కోలుకుని ఇంటికి చేరారు. పల్లెలో సాధారణ పరిస్థితులు చోటు చేసుకుంటున్నాయి. ప్రత్యేక ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఊరిలో మునుపటి పరిస్థితులు నెలకొనే వరకు వైద్య శిబిరం కొనసాగిస్తామని మండల వైద్యాధికారులు కె.శ్రీధర్, క్రిస్టల్ బుధవారం తెలిపారు.

# ఎస్ఐపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

- స్టేషన్‌లో బాధితులను చితకబాదిన ఎస్ఐ
- శాఖాపరమైన చర్యలకు మాలమహానాడు డిమాండ్



ఎస్ఐ లోకేష్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని సీఐలు సద్గురుడు, ఎన్.శేఖర్‌లకు వినతిపత్రం అందిస్తున్న మాలమహానాడు, దళితసంఘాల నాయకులు

నిమ్మనపల్లె : సమస్యను చెప్పుకునేందుకు స్టేషన్‌కు వచ్చిన బాధితులపైనే ఎస్ఐ జులుం ప్రదర్శించి, చితకబాదడంపై బుధవారం నిమ్మనపల్లె పోలీస్‌స్టేషన్ ఎదుట మాలమహానాడు, దళితసంఘాల నాయకులు రాస్తారోకో చేసి, ధర్నా నిర్వహించారు. ఎస్ఐకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఎస్ఐపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని, శాఖాపరమైన చర్యల్లో భాగంగా సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఐ వైఖరిపై మదనపల్లె తాలూకా, రూరల్ సీఐలు ఎన్.శేఖర్, సద్గురుడులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాలమహానాడు ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు యమలా సుదర్శనం మాట్లాడుతూ...మదనపల్లె మండలం బసినికొండకు చెందిన దళితుడు రామకృష్ణ తన అవసరాల నిమిత్తం కారును నిమ్మనపల్లె మండలం ఎగువమాచిరెడ్డిపల్లెకు చెందిన శంకర సహాయంతో, బసినికొండలోని హరికి కుదువ పెట్టాడు. పైకం చెల్లించి కారు స్వాధీనం చేసుకునే క్రమంలో వివాదం ఏర్పడటంతో రామకృష్ణ మే7వ తేదీన నిమ్మనపల్లె పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించాడు. తమ సమస్యను చెప్పి న్యాయం చేయాల్సిందిగా కోరాడు. అయితే...ఎస్ఐ లోకేష్‌రెడ్డి, దాదాపుగా రెండునెలల కాలంలో వారికి న్యాయం చేయకపోగా, పలుమార్లు స్టేషన్ చుట్టూ తిప్పించుకున్నారు. హరికి వత్తాసు పలుకుతూ రామకృష్ణకు కారు స్వాధీనం చేయకుండా ఇబ్బందులకు గురిచేశారు. ఇదే విషయమై మంగళవారం రామకృష్ణ, శంకరలు నిమ్మనపల్లె స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ లోకేష్‌రెడ్డితో మాట్లాడారు. తమకు రెండునెలలుగా న్యాయం చేయకపోవడంపై ఎస్ఐను నిలదీశారు. దీంతో నన్నే నిలదీస్తారా అంటూ రామకృష్ణ, శంకరలపై లాఠీతో ఎస్ఐ జులుం ప్రదర్శించి, చావచితకబాదాడు. బాధితులు చేసేదిలేక దళితసంఘనాయకులు, మాలమహానాడును ఆశ్రయించి, తమకు జరిగిన అన్యాయంపై వివరించారన్నారు. దీనిపై దళితసంఘాలు స్పందించి బాధితుల తరపున నిరసన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈ విషయమై ఎస్ఐ లోకేష్‌రెడ్డి వివరణ ఇస్తూ.. ఫిర్యాదులో భాగంగా శంకర, రామకృష్ణను స్టేషన్‌కు పిలిచి విచారించామన్నారు. ఆర్థిక వ్యవహారం కావడంతో మీరే తేల్చుకోవాల్సిందిగా చెప్పామన్నారు. అయితే వారు స్టేషన్‌కు వచ్చి గొడవ చేయడంతో మందలించామన్నారు. తాను ఎవ్వరినీ కొట్టలేదన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు హరి, శివయ్య, యర్రయ్య, చంద్రయ్య, గుండామనోహర్, మల్లెలమోహన్, వెంకటస్వామి, సుధాకర్, లక్ష్మీపతి, వీర్నాలమాణిక్యం, నరేష్, సుధాకర్, ఎంఆర్‌పీఎస్ రెడ్డినారాయణ, బాస్ చంద్రాయుడు, గంగులప్ప, సహదేవ, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# నేడు ప్రత్యేక విద్యుత్ అదాలత్

మదనపల్లె : మదనపల్లె డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సీటీఎంరోడ్డులోని డివిజన్ ఆఫీస్ కాంపౌండ్‌లో ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.యుగంధర్ తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...ప్రత్యేక విద్యుత్ అదాలత్‌లో అధ్యక్షులు, ఇన్‌చార్జ్, ఆర్థికసభ్యులు హోదాలో రిటైర్డ్‌జడ్జి శ్రీనివాస ఆంజనేయ మూర్తి, కే.రామమోహన్, సాంకేతిక సభ్యులు యస్.ఎల్.అంజనీకుమార్, స్వతంత్ర్యసభ్యులు జి.ఈశ్వరమ్మ పాల్గొంటారన్నారు. వీరితో మదనపల్లె డివిజన్ పరిధిలోని బి.కొత్తకోట, పీటీఎం, ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, కురబలకోట, నిమ్మనపల్లె, మదనపల్లె రూరల్, మదనపల్లె అర్బన్, రామసముద్రం మండలాలకు సంబంధించిన ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ(ఏపీఎస్పీడీసీఎల్) సంస్థకు చెందిన అధికారులు, సిబ్బంది అదాలత్‌కు హాజరవుతున్నారన్నారు. విద్యుత్ వినియోగదారులు పరిష్కారం కాని తమ సమస్యలను రాతపూర్వకంగా ఫిర్యాదు రూపంలో అదాలత్‌లో సమర్పిస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఈఈ పి.యుగంధర్ కోరారు.

## హోంమంత్రికి చినబాబు అభినందనలు



హోం మంత్రి వంగలపూడి అనితకు శుభాకాంక్షలు తెలుపుతున్న శ్రీరామ్ చినబాబు

మదనపల్లె : రాష్ట్ర హోంశాఖమంత్రి వంగలపూడి అనితను పట్టణానికి చెందిన రాష్ట్ర తెలుగుయువత అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు బుధవారం అమరావతి సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. నూతనంగా పదవీబాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛాన్ని, వెంకటేశ్వర స్వామివారి ప్రతిమను అందించారు.

# సివిల్ సప్లై హమాలీల ధర్నా



మదనపల్లె: హమాలీలతో కలిసి నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

మదనపల్లె : జిల్లాలోని సివిల్ సప్లై పాయింట్లలో లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తున్న హమాలీలకు జీతాలు మొదటివారంలోనే అందేలా జిల్లాస్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. హమాలీలకు నెల ప్రారంభమై 19 రోజులు కావస్తున్నా, ఇంతవరకు వేతనాలు చెల్లించకపోవడంపై అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ బుధవారం మదనపల్లె సివిల్ సప్లై పాయింట్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మదనపల్లె పట్టణ కార్యదర్శి తిరుమల, మురళి, నరసింహులు, అయూబ్, రామాంజనేయులు, కుమార్, రఫీ, జగదీష్, నజీమ్, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

**బి.కొత్తకోటలో..**

బి.కొత్తకోట: జిల్లాలో సివిల్ సప్లయ్ పాయింట్లలో ఎగుమతి, దిగుమతి చేస్తున్న సివిల్ సప్లయ్ హమాలీలకు జీతాలు మొదటి వారంలోనే అందేలా సివిల్ సప్లయ్ శాఖ జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ తంబళ్లపల్లె నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్. సలీంబాషా, బి. వేణుగోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. 19 రోజులు కావస్తున్నా హమాలీలకు వేతనాలు చెల్లించలేదని, అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ బుధవారం బి.కొత్తకోట సివిల్ సప్లయ్ పాయింట్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హమాలీలకు వేతనాలు చెల్లించడంలో ప్రతి నెలా ఆలస్యం జరుగుతోందన్నారు. అధికారులకు తెలియజేసినా వేతనాలు చెల్లింపు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సివిల్ సప్లయ్ పాయింట్ల వాచ్‌మెన్‌లకు సకాలంలో జీతాలు చెల్లించే అధికారులు హమాలీల జీతాలు చెల్లించే విషయంలో నిర్లక్ష్యం ఎందుకని ఆయన అధికారులను ప్రశ్నించారు. అగ్రిమెంట్ పూర్తయి ఆరు నెలలు కావస్తున్నా ఇంతవరకు కొత్త అగ్రిమెంట్ చేయలేదన్నారు. హమాలీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సివిల్ సప్లై హమాలీలు ఎస్.బాబాజాన్ లక్ష్మన్న , జబీబుల్లా, వెంకటరమణ, రాజి, గంగాధర్, గని, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా లక్ష్మీనరసింహస్వామి పల్లకీసేవ



పల్లకీలో విహరిస్తున్న లక్ష్మీనరసింహస్వామి

కలికిరి: మండల కేంద్రంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండవ రోజు బుధవారం స్వామివారి పల్లకీ సేవను వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు మురళీధరాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం స్వామివారి తిరుమంజనం, అనంతరం ప్రత్యేక అలంకరణ పల్లకీలో పురవీధులలో ఊరేగింపు నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవార్లు సింహవాన సేవ, పురవీధులలో భక్తులు స్వామి వార్లకు కొబ్బరికాయలు సమర్పించి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. గురువారం పల్లకీసేవ, రాత్రికి హనుమంత వాహన సేవ జరుగుతుందని అర్చకులు తెలిపారు.

## యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయండి

పీలేరు : ఈ నెల 21న షీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రపంచ యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని షీ సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ పి.వి.యస్. లక్ష్మీ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద ఆమె మాట్లాడుతూ ఈ నెల 21న స్థానిక ఆర్యవైశ్య కల్యాణమండపంలో ఉదయం 6 గంటల నుంచి యోగా దినోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, యోగాపై ఆసక్తివున్న వారు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, డాకక్టర్ ఈశ్వర సురేంద్ర, డాక్టర్ నాగవేణి, డాక్టర్ రాయల సుధాకర్, వీఎస్ఎన్ స్కూల్ అదినేత మాధవి పాల్గొన్నారు.

# బీసీజీ టీకాలు వేయించుకోండి



బీసీజీ టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

వాల్మీకిపురం: ఆరోగ్య కేంద్రాల్లో సోమ, గురువారాల్లో పెద్దలకు బీసీజీ టీకాలు వేయనున్నట్లు మండలంలోని చింతపర్తి పిహెచ్‌సి హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, సూపర్‌వైజర్ సుధాకర్, బిటి యూనిట్ సూపర్‌వైజర్ నాగిరెడ్డి తెలిపారు. బుధవారం చింతపర్తి పిహెచ్‌సి పరిధిలోని బోయపల్లి, పాత మంచూరు గ్రామాల్లో పెద్దలకు బీసీజీ టీకాలు వేసి, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హత గల ఆరు వర్గాల వారు సమీపంలోని ఆరోగ్య కేంద్రాల్లో బీజీసీ టీకాలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## రక్త పరీక్షలు చేసుంచుకోండి




మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ లీనాకుమారి

మదనపల్లె సిటీ: సికెల్ వ్యాధి ఉందా లేదా అని తెలుసుకోవడానికి ముందుగా రక్తపరీక్షలు చేసుకోవాలని వెలుగు ప్రత్యేక పాఠశాల ప్రిన్సిపాల్ లీనాకుమారి అన్నారు. బుధవారం వెలుగు పాఠశాలలో వరల్డ్ సికెల్ సెల్ డే కార్యక్రమం నిర్వహించారు. సికెల్ సెల్ వ్యాధి అనేది సాధారణంగా వారసత్వంగా వచ్చే రుగ్మతల సమూహమన్నారు. ఈ వ్యాధి వల్ల అనేక ఆరోగ్య సమస్యలు అభివృద్ధి చెందుతాయని, రక్తహీనత, చేతులు,కాళ్లలో వాపు, బాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు ఉంటాయన్నారు. వ్యక్తుల సంరక్షణలో టీకా, యాంటీ బయాటిక్స్, అధిక ద్రవం తీసుకోవడం, ఫోలిక్ యాసిడ్‌సప్లిమెంటేషన్ వల్ల నివారించవచ్చునన్నారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

## సికెల్ సెల్ అనీమియా వ్యాధి నిర్మూలనే లక్ష్యం



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

వాల్మీకిపురం: 2047 నాటికి సికెల్ సెల్ అనీమియా వ్యాధి నిర్మూలనే లక్ష్యం అనే నినాదంతో మిషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ తెలిపారు. బుధవారం మండలంలోని పాతమంచూరులో ప్రజలకు సికెల్ సెల్ అనేమియా వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికెల్ సెల్ అనేమియా వారసత్వ పరంగా వచ్చే ఎర్రరక్తకణాల రుగ్మత అని ఈ జబ్బు తల్లిదండ్రుల నుండి అనువంశికంగా వస్తుందన్నారు. సికెల్ సెల్ నిర్ధారణ పరీక్షలు అన్ని పిహెచ్‌సి, సిహెచ్‌సిలల్లో పరీక్షించుకోవచ్చునన్నారు. 40 ఏళ్ళ లోపు వారంతా ఒక చుక్క రక్తం ఇచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి సూపర్‌వైజర్ సుధాకర్, టిబి యూనిట్ సూపర్‌వైజర్ నాగిరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పి వనిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యాహక్కు చట్టం పటిష్టంగా అమలు చేయాలి



మాట్లాడుతున్న ఎంఈఓ లోకేశ్వర్‌రెడ్డి

పీలేరు రూరల్ : విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఎంఈవోలు లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతి, అన్నారు. బుధవారం ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యంతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ద్వారా ప్రయివేట్ పాఠశాలల్లో ఉచితంగా ప్రవేశం పొందిన విద్యార్థుల నుంచి ఎటువంటి ఫీజులు వసూలు చేయరాదన్నారు. ప్రతి పాఠశాల అడ్మిషన్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. పాఠ్యపుస్తకాల్లో ఐదు శాతం రుసుము ప్రభుత్వానికి చెల్లించాలని తెలిపారు. ప్రతి పాఠశాల ప్రభుత్వ నిబంధనలకు లోబడి నడుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యం పాల్గొన్నారు.

## వైభవంగా మారెమ్మతల్లి జాతర

సంబేపల్లె : మండల పరిధిలోని శెట్టిపల్లె పంచాయతీ చిన్నబిడికి సమీపంలో కొలువైన శ్రీ మారెమ్మతల్లి జాతర అంగరంగ వైభవంగా జరిగింది. మంగళవారం ఉదయం నుంచి అమ్మ వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు.రాత్రి చాందినీబండ్లను ఆలయం చుట్టూ తిప్పారు.

## పూర్తి స్థాయిలో స్టూడెంట్ కిట్లు అందజేయాలి



బాపూజీ మున్సిపల్ పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీవైఈఓ శ్రీరాం పురుషోత్తం

మదనపల్లె సిటీ: స్టూడెంట్ కిట్లు పూర్తి స్థాయిలో అందజేయాలని మదనపల్లె డీవైఈఓ శ్రీరాం పురుషోత్తం అన్నారు. బుధవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలలో పాఠ్యపుస్తకాల స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. స్థానిక బాపూజీ మున్సిపల్ పాఠశాలను తనిఖీ చేసి పాఠశాలలో నెలకొన్న సమస్యలను పేరెంట్స్ కమిటీ సభ్యులతో అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో టీచర్లత్ల కొరతను నివారించుటకు తాత్కాలికంగా ఇతర పాఠశాల నుంచి డిప్యూటేషన్ ప్రాతిపాదికన ఉపాధ్యాయులను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బాపూజీ స్కూల్ హెచ్‌ఎం రఘు తదితరులు పాల్గొన్నారు.

## 'నేను బడికిపోతా' జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఉపేంద్రరెడ్డి

పీలేరు : 'నేను బడికిపోతా' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఎంపీడీఓ ఉపేంద్రరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడి మానేసిన విద్యార్థులను గుర్తించడానికి అధికారులు సమష్టిగా కృషి చేయాలన్నారు. బడిబయటి పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ, సీఆర్‌పీలు, గ్రామ సచివాలయ విద్యా సంక్షేమ సహాయకులు విద్యార్థులను బడిలో చేర్పించడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూప, ఉపాధ్యాయులు రహత్‌బాషా, అక్రమ్‌బాషా, సత్యనారాయణ, సీఆర్‌పీ మురళీధర్‌రాజు పాల్గొన్నారు.

## 'నీట్'పై సమగ్ర విచారణ చేయాలి

రాయచోటి అర్బన్ : నీట్ ఫలితాల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేయాలని ఏఐఎస్ఏ నేతలు డిమాండ్ చేశారు. నీట్ ఫలితాల్లో అవినీతిపై చర్యలు తీసుకోవాలంటూ బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏఐఎస్ఏ నేతలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఏ జిల్లా అధ్యక్షుడు ఎన్.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ నీట్ పరీక్షల నిర్వహణలో అవినీతి జరిగిందని ఆరోపించారు. ఫలితాల్లో 67 మంది విద్యార్థులు 720కి 720 మార్కులు రావడం అనుమానాలకు తావిస్తోంద న్నారు. పరీక్ష నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సన్నీ, కుమార్, వెంకటరమణ, అరవింద్, రాజకుమార్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.